సాక్షి
బాపట్ల
గురువారం । 13 । ఏప్రిల్ । 2023



పెదపలకలూరుకు కంచి పీఠాధిపతి

గుంటూరు రూరల్: కంచికామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామి బుధవారం పెదపలకలూరులో పర్యటించారు. గతంలో దాతలు ఇచ్చిన భూమిని ఆయన పరిశీలించారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: మార్కెట్ యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ఠధర రూ.3,800 , గరిష్ఠధర రూ.6,500 , మోడల్ ధర రూ.5,000 వరకు పలికింది.

నాలుగు కరోనా కేసులు

గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా బుధవారం నాలుగు కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. గుంటూరు నగరంలోని చుట్టుగుంటలో ఒకటి, మంగళగిరిలో ఒకటి, చిన కాకానిలో రెండు కేసులు నమోదయ్యాయి. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించ లేదు.







సభలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వేదికపై బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆదిమూలపు సురేష్, మేరుగు నాగార్జున, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, బూచేపల్లి వెంకాయమ్మ, కలెక్టర్ దినేష్ కుమార్, ఎమ్మెల్యేలు కేపీ నాగార్జునరెడ్డి, బుర్రా మధుసూదన్‌యాదవ్, టీజేఆర్ సుధాకర్‌బాబు, మద్దిశెట్టి వేణుగోపాల్, కరణం బలరాం, అన్నా రాంబాబు, మాజీ ఎమ్మెల్యేలు జంకె వెంకటరెడ్డి, గరటయ్య, కదిరి బాబూరావు, నాయకులు కరణం వెంకటేష్, వరికూటి అశోక్‌బాబు, సత్యనారాయణరెడ్డి.



ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం జగన్

పురం జనసంద్రం

- సీఎం సభకు భారీగా తరలివచ్చిన జనం
- జగన్నినాదంతో మార్మోగిన మార్కాపురం
- పూలుజల్లి అభిమానాన్ని చాటుకుని..
- వరాలతో హర్షాతిరేకాలు
- అక్టోబర్‌లో వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభం

మార్కాపురం: మార్కాపురం జనసంద్రంగా మారిపోయింది. ఈబీసీ నేస్తం రెండో విడత ప్రారంభోత్సవానికి బుధవారం మార్కాపురానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా భారీ ఎత్తున ప్రజలు, అభిమానులు, కార్యకర్తలు తరలివచ్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు. పశ్చిమ ప్రకాశం వైఎస్సార్ సీపీ అడ్డా అని మరోమారు నిరూపించారు. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం పట్టణ జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు సీఎం జగన్ చేరుకున్నారు. అక్కడ నుంచి ప్రత్యేక బస్సులో సభా ప్రాంగణానికి బయలు దేరారు. మున్సిపల్ కార్యాలయం, పాత బస్టాండ్, దోర్నాల సెంటర్, కాలేజి రోడ్డు మీదుగా డిగ్రీ కళాశాల ప్రాంగణం వరకు రోడ్లకు ఇరువైపులా వేలాది మంది ప్రజలు ఘనస్వాగతం పలికారు. కాన్వాయ్‌పై పూలు జల్లుతూ జై జగన్ నినాదాలతో హోరెత్తించారు. గిద్దలూరు, యర్రగొండపాలెం నియోజకవర్గంలోని పుల్లల చెరువు దాక మార్కాపురం మండలంలోని శివారు గ్రామాలైన గొట్టిపడియ, గజ్జలకొండ గ్రామాలతో పాటు తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి మండలాల్లోని అన్ని గ్రామాల నుంచి వైఎస్సార్ సీపీ అభిమానులు, మహిళలు సభాప్రాంగణానికి ఉదయం 9 గంటలకే చేరుకున్నారు. సభాప్రాంగణం నిండిపోవడంతో ఎండలోనే పెద్దఎత్తున జనం బయటే ఉండి సీఎం ప్రసంగాన్ని ఆసక్తిగా విన్నారు. సీఎం వేదికపైకి రాగానే జై జగన్ నినాదాలతో సభా ప్రాంగణం మారుమోగింది. ఆయన ప్రసంగాన్ని ఆద్యంతం ఆసక్తిగా విన్నారు. ఎల్లోమీడియా, చంద్రబాబులపై చేసిన విమర్శలకు సభలో ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన వచ్చింది.

వరాల జల్లు కురిపించిన జగన్:

''నా తమ్ముడు నాగార్జునరెడ్డి అడిగిన కోరికలన్నీ తీరుస్తున్నాను. ఇప్పుడే కొన్ని పథకాలకు భూమి పూజ కూడా చేసి శిలఫలకాలను ఆవిష్కరించానని'' సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. దీంతో సభా ప్రాంగణంలో ప్రజలు జై జగన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. 40 ఏళ్ల నుంచి పరిష్కారం కాని పొదిలి నీటి సమస్య పరిష్కారానికి రూ.50 కోట్లతో నీటి పథకాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మార్కాపురానికి కూడా నీటి సమస్య నివారణకు రూ.5 కోట్లు కేటాయించామని అన్నారు. మార్కాపురం పట్టణంలో పెండింగ్‌లో ఉన్న సమస్యను కూడా పరిష్కరిస్తున్నానని హామీ ఇచ్చారు. మెడికల్ కాలేజీకి సంబంధించి ఐదుగురు రైతులకు ఒక్కొక్కరికి రూ.3 లక్షలు చొప్పున ల్యాండ్ డెవలప్‌మెంట్ కోసం ఇస్తున్నానని ప్రకటించడంపై హర్షం వ్యక్తమైంది. పొదిలి మెయిన్ రోడ్డు డెవలప్‌మెంట్‌కు సంబంధించి రూ.11 కోట్లు, షాదీఖానాకు రూ.2 కోట్లు, మార్కాపురం పట్టణంలో అంబేడ్కర్ భవన్, బీసీ భవన్ కూడా నిధులు మంజూరు చేస్తున్నానని వేలాది మంది ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. దీనికి ఎమ్మెల్యే కేపీ ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. పొదిలి, మార్కాపురం నీటి సమస్యకు సీఎం పరిష్కారం చూపడంతో మార్కాపురం, పొదిలి ప్రాంత ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.అలాగే వెలిగొండ ప్రాజెక్టును అక్టోబరులో ప్రారంభిస్తానని ప్రకటించడంతో జనం నుంచి పెద్ద ఎత్తున హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.

సీఎం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ దగ్గర ఉండి ఏర్పాట్లను పరిశీలించారు. ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డికి పలు సూచనలు చేశారు. వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, మంత్రులు చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ,ఆదిమూలపు సురేష్, మేరుగ నాగార్జున, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, మద్దిశెట్టి వేణుగోపాల్, బుర్రా మధుసూదన్ యాదవ్, టీజేఆర్ సుధాకర్ బాబు, కరణం బలరామ్, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, మాజీ ఎమ్మెల్యేలు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఉడుముల శ్రీనివాసరెడ్డి, బాచిన చెంచు గరటయ్య, కదిరి బాబూరావు, శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య, కొండపి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు, చీరాల ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్, రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతల చెరువు సత్యనారాయణరెడ్డి, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, మంత్రి సురేష్ సోదరుడు సతీష్, మార్కాపురం మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, రాష్ట్ర కార్యదర్శులు షంషీర్ అలీబేగ్, వెన్నా హనుమారెడ్డి, అన్నా కృష్ణచైతన్య, శిద్దా సుధీర్, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు మాదిగ, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్లు మేడా బద్రి, ఎస్ కొండయ్య, కేపీ రమణారెడ్డి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ జయలక్ష్మి, కమిషనర్ మల్లికార్జున, జెడ్పీటీసీ నారు బాపన్‌రెడ్డి, ఎంపీపీ చెంచిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ దినేష్ కుమార్, ఎస్పీ మలికాగర్గ్, సబ్‌కలెక్టర్ సేథుమాధవన్, జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, స్పెషల్ కలెక్టర్ సరళా వందనం, ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఈబీసీ లబ్ధిదారులతో సమావేశం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సభా ప్రాంగణంలో ఈబీసీ లబ్ధిదారులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఈబీసీ పథకాన్ని తాము ఎలా ఉపయోగించుకుంటున్నది లబ్ధిదారులైన మహిళలు సీఎంకు వివరించారు.

న్యూస్‌రీల్

తీరంలో ఇద్దరు గల్లంతు

ఒకరి మృతదేహం లభ్యం



ఇర్ఫాన్ (ఫైల్)

చీరాల టౌన్: సరదాగా సముద్రంలో స్నానాలు చేసేందుకు రామాపురం తీరానికి వచ్చి ఐదుగురు స్నేహితుల బృందంలో ఇరువురు యువకులు తీరంలో గల్లంతయ్యారు. ఈ సంఘటన బుధవారం రాత్రి చీరాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామాపురం సముద్ర తీరంలో చోటు చేసుకుంది. పట్టణంలోని గంజిపాలెంకు చెందిన ఇర్ఫాన్ (16), రెహమాన్ (16)తో పాటు మరో ముగ్గురు ఐదుగురు సముద్ర స్నానాలు చేసేందుకు బుధవారం సాయంత్రం వచ్చారు. రామాపురంలోని ఓ రిసార్ట్స్ సమీపంలో సముద్రంలో మునుగుతుండగా అలల తాకిడికి గురై రెహమాన్, ఇర్ఫాన్‌లు గల్లంతయ్యారు. మిగిలిన ముగ్గురు స్నేహితులు సమాచారాన్ని వారి తల్లిదండ్రులకు అందించారు. పోలీసులు గల్లంతైన యువకుల కోసం ప్రయత్నాలు చేపట్టగా ఇర్ఫాన్ మృతదేహం రాత్రి 9 గంటల సమయంలో ఒడ్డుకు వచ్చింది. రెహమాన్ మృతదేహం కోసం బంధువులు తీరంలో వెతుకుతున్నారు.

కౌశల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ కోసం నమోదు చేసుకోవాలి

గుంటూరు ఎడ్యుకేషన్: వివిధ దేశాల్లో ఉద్యోగాల భర్తీ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అంతర్జాతీయ కౌశల్ మహోత్సవంలో భాగంగా మొదటిసారిగా చేపడుతున్న అంతర్జాతీయ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ కోసం ఈనెల 16లోపు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని జిల్లాస్థాయి పారిశ్రామిక శిక్షణా సంస్థ సహాయ డైరెక్టర్ ఎస్. మధుసూదనరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిక్రూట్‌మెంట్ డ్రైవ్ కోసం ఒకటో తరగతి మొదలు ఉన్నత విద్యార్హతలు కలిగిన వారు, ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు https://kaushalmahotsav.nsdcdigital.org లింక్‌లో తమ పేరును రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు 83339 73929 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

ఆరోగ్యశ్రీ కార్యాలయంలో అగ్ని ప్రమాదం



మంగళగిరి: నగర పరిధిలోని చినకాకాని ఎన్నారై జంక్షన్‌లో గల వైఎస్సార్ ఆరోగ్య శ్రీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం చోటుచేసుకోగా ఉద్యోగులు, సిబ్బంది బయటకు పరుగులు పెట్టారు. సమాచారం అందుకున్న అగ్ని మాపక సిబ్బంది చేరుకుని మంటలను అదుపులోకి తీసుకు వచ్చారు.

యార్డుకు 1,15,410 బస్తాల మిర్చి రాక



కొరిటెపాడు (గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 1,15,410 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,14,880 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.25,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.26,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 90,186 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

ఆదాయం అధరహో..!

నూతన జిల్లా బాపట్లలో రిజిస్ట్రేషన్ల రాబడి భారీగా పెరిగింది. గడిచిన నాలుగేళ్లలో రిజిస్ట్రేషన్ల సంఖ్య పెరుగుతూరాగా, జిల్లాగా ఏర్పడిన ఈ ఏడాదిలో పెరుగుదల శాతం అనూహ్యంగా నమోదయింది. తద్వారా ప్రభుత్వానికి ఆదాయం పెరిగింది. బాపట్ల జిల్లా కేంద్రం కావడం, అభివృద్ధి పనులు వేగంగా సాగుతుండటంతో క్రయ, విక్రయాలు జోరుగా సాగుతూ, ఆదాయ వృద్ధికి ఊతమిచ్చాయి.

– సాక్షి ప్రతినిధి, బాపట్ల

కొత్త జిల్లాలో పెరిగిన భూముల ధరలు.. రిజిస్ట్రేషన్ల రాబడి

- గడిచిన ఏడాదిలో రూ.179.32 కోట్ల రాబడి
- జిల్లాలో 12 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు
- 77,995 దస్తావేజులు రిజిస్ట్రేషన్లు
- గతేడాదితో పోలిస్తే 18.35 శాతం పెరిగిన వైనం
- భూములు, స్థలాల ధరలకు రెక్కలు
- పెరిగిన క్రయ, విక్రయాలు



జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

జిల్లాలో భట్టిప్రోలు, చెరుకుపల్లి, కొల్లూరు, అమృతలూరు, మంతెనవారిపాలెం, రేపల్లె, బాపట్ల, అద్దంకి, చీరాల, ఇంకొల్లు, మార్టూరు, పర్చూరు మొత్తం 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలున్నాయి. వీటి పరిధిలో గడిచిన ఆర్థిక సంవత్సరంలో 77,995 దస్తావేజులకు రిజిస్ట్రేషన్లు జరిగాయి. దీంతో రూ.179.32 కోట్ల రాబడి వచ్చింది. చీరాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో అత్యధికంగా 13,227 దస్తావేజులు రిజిస్ట్రేషన్ కాగా, రూ.40.69 కోట్ల రాబడి వచ్చింది. బాపట్ల సబ్ రిజిస్ట్రార్ పరిధిలో 13,107 దస్తావేజులు రిజిస్ట్రేషన్ కాగా రూ.31.16 కోట్లు, అద్దంకి పరిధిలో 11,262 దస్తావేజులకు గానూ రూ.30.29 కోట్లు, రేపల్లె పరిధిలో 9,250 దస్తావేజులకు గానూ రూ.18.71 కోట్లు, మార్టూరు పరిధిలో 7465 దస్తావేజులకు గానూ రూ.14.40 కోట్లు రాబడి వచ్చింది. మొత్తం 12 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో 77,995 దస్తావేజులకు గానూ రూ.179.32 కోట్లు రాబడి వచ్చింది. 2021-22 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2022-23 సంవత్సరంలో 18.35 శాతం రిజిస్ట్రేషన్లు పెరిగినట్లు అధికారిక గణంకాలు తెలియజేస్తున్నాయి.

బాపట్ల జిల్లా కావడంతో..

ప్రభుత్వం బాపట్లను కొత్త జిల్లాగా ఏర్పాటుచేయటంతో రిజిస్ట్రేషన్ల రాబడి మరింతగా పెరిగింది. జిల్లా కేంద్రం కావడంతో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఇక్కడికే తరలివచ్చాయి. దీంతో నూతనంగా ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటయ్యాయి. అభివృద్ధి పనులు వేగం పుంజుకున్నాయి. దీంతోపాటు కొత్తరోడ్ల నిర్మాణం, పాతరోడ్ల విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఒంగోలు-దిగమర్రు జాతీయ రహదారి నిర్మాణం జరగడంతో జిల్లా కేంద్రంతోపాటు జిల్లా వ్యాప్తంగా భూములు, స్థలాల ధరలకు రెక్కలొచ్చాయి. ఉదా: గతంలో రూ. 10 లక్షలు ఉన్న ఎకరం, నేడు రూ. కోటికి చేరింది. అర్బన్ ప్రాంతాల్లో ఇంతకు మించి ధరలు పెరిగాయి. క్రయ, విక్రయాలు మరింత ఊపందుకున్నాయి. దీంతో రిజిస్ట్రేషన్ల సంఖ్య ఇబ్బడిముబ్బడిగా పెరిగింది. తద్వారా ప్రభుత్వానికి రాబడి పెరిగింది.

జిల్లాలో రిజిస్ట్రేషన్లు ఇలా..

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం	దస్తావేజులు	రాబడి (లక్షల్లో)
భట్టిప్రోలు	3702	578.23
చెరుకుపల్లి	3647	813.38
కొల్లూరు	2849	869.71
అమృతలూరు	1949	360.25
మంతెనవారిపాలెం	4159	527.10
రేపల్లె	9250	1871.60
బాపట్ల	13,107	3116.71
అద్దంకి	11,262	3029.57
చీరాల	13,227	4069.63
ఇంకొల్లు	4069	749.37
మార్టూరు	7465	1441.09
పర్చూరు	3309	505.98
మొత్తం	77,995	17932.62

రిజిస్ట్రేషన్లు పెరిగాయి



జిల్లాలో రిజిస్ట్రేషన్ల సంఖ్య మరింతగా పెరిగింది. దీంతో ప్రభుత్వానికి రాబడి పెరిగింది. 2021-22 ఏడాదితో పోలిస్తే గత ఆర్థిక సంవత్సరంలో 18.39 శాతం మేర రిజిస్ట్రేషన్లు పెరిగాయి. రిజిస్ట్రేషన్లతో గతేడాది రూ.179.32 కోట్ల రాబడి వచ్చింది. జిల్లాలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరుగుతుండటంతో క్రయ, విక్రయాలు పెరుగుతున్నాయి. భూములు, స్థలాల విలువ పెరిగింది. దీంతో రిజిస్ట్రేషన్ల రాబడి పెరిగింది.

– జి. లక్ష్మి, జిల్లా రిజిస్ట్రార్

కుటుంబానికి సంక్షేమ ప్రయోజనం

- సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ సూచన
- ఈబీసీ లబ్ధిదారులకు చెక్కు పంపిణీ



చెక్కును పంపిణీ చేస్తున్న హెన్రీ క్రిస్టినా, బత్తుల

బాపట్ల: రాష్ట్రంలో మహిళలకు సంక్షేమ పథకాల వల్ల ప్రయోజనం చేకూరుతోందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హెన్రీ క్రిస్టినా వెల్లడించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో వైఎస్సార్ ఈబీసీ నేస్తం ముఖ్యమంత్రి వర్చువల్ లాంచింగ్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేశారన్నారు. రాష్ట్రంలో కుల మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేస్తున్నారనీ, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాదయాత్ర సమయంలో పేదల కష్టాలు చూసిన ముఖ్యమంత్రి అగ్రవర్ణాల పేద ప్రజల కోసం వైఎస్సార్ ఈబీసీ నేస్తం కార్యక్రమం ద్వారా పేద ప్రజలను ఆదుకుంటున్నారన్నారు. బాపట్ల జిల్లాలో వైఎస్సార్ ఈబీసీ నేస్తం క్రింద 26 వేల 221 మందికి 39.28 కోట్ల రూపాయలు బటన్ నొక్కి ముఖ్యమంత్రి లబ్ధిదారుల ఖతాలకు జమ చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్మన్ వైఎస్సార్ ఈబీసీ నేస్తం మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహకార మార్కెటింగ్ సలహాదారులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేట్ డైరెక్టర్ ఏడుకొండలు, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గోలి కుమారి, జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మీ శివ జ్యోతి, మున్సిపల్ కమిషనర్ భాను ప్రతాప్, బీసీ కార్పొరేషన్ పరిపాలనా అధికారి నరసింహమూర్తి, మహిళలు పాల్గొన్నారు.

గోపాయపాలెం కుర్రోడికి ప్రతిష్టాత్మక ఫెలోషిప్

బార్-ఇలాన్ యూనివర్సిటీ శాండ్‌విచ్ డాక్టోరల్ స్కాలర్‌షిప్-2023కు ఎంపిక



తెనాలి: ఆ విద్యార్థికి చదువుల దాహం తీరటం లేదు. పీహెచ్‌డీ పరిశోధనలో ఉండగానే రీసెర్చ్ ఎక్చేంజ్ ప్రోగ్రాం కింద పలు ప్రతిష్టాత్మక ఫెలోషిప్‌లకు ఎంపికవుతున్నాడు. ఒకటి పూర్తయే సరికి మరొక ఫెలోషిప్ / స్కాలర్‌షిప్‌తో మరో దేశం ప్రయాణమవుతున్నాడు. ఆ పరిశోధక విద్యార్థి మేకా శరత్‌కుమార్. తెనాలి సమీపంలోని బాపట్ల జిల్లా అమృతలూరు మండలంలోని మోపర్రు శివారు గోపాయపాలెం అతడి సొంతూరు. ఇజ్రాయిల్ దేశంలోని ప్రపంచ ప్రఖ్యాత బార్-ఇలాన్ యూనివర్సిటీ శాండ్‌విచ్ డాక్టోరల్ స్కాలర్‌షిప్-2023కు ఎంపికయ్యాడు. ప్రపంచంలోని అత్యుత్తమ శాస్త్రవేత్తల్లో ఒకరైన ప్రొఫెసర్ డోరన్ ఔర్బాచ్ నేతృత్వంలో కెమికల్ ఇంజినీరింగ్‌లో శరత్‌కుమార్ పరిశోధన కొనసాగించనున్నారు. ఇందుకుగాను నెలకు 6600 ఇజ్రాయిల్ కరెన్సీ న్యూషెకిల్స్ (దాదాపు రూ.1.50 లక్షలు)ను స్కాలర్‌షిప్‌గా యూనివర్సిటీ అందజేస్తుంది. సాధారణ వ్యవసాయ కుటుంబంలో జన్మించిన శరత్‌కుమార్ చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయారు. తల్లి పెంపకంలో చదువుకుంటూ వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీలో బీటెక్ చేశాడు.

యార్డ్ చైర్మన్‌గా సీతారామిరెడ్డి



కర్లపాలెం: బాపట్ల వ్యవసాయ మార్కెటింగ్ యార్డ్ చైర్మన్‌గా వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు దొంతిబోయిన సీతారామిరెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. యార్డ్ చైర్మన్‌గా ప్రభుత్వం తనను నియమిస్తూ జారీ చేసిన ఉత్తర్వులు బుధవారం తనకు అందాయని సీతారామిరెడ్డి తన స్వగృహంలో తెలిపారు. సీతారామిరెడ్డి గతంలో బాపట్ల తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ 2010 ఏప్రిల్ పదవీ విరమణ చేశారు. సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ సీపీ స్థాపించిన తరువాత బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పిలుపు మేరకు సీతారామిరెడ్డి పార్టీలో చేరారు. కోన రఘుపతికి నమ్మకస్తుడిగా ఉంటూ పార్టీ అభివృద్ధికి చేసిన కృషికి ఆయనను వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడిగా 2011, 2016లో రెండుసార్లు నియమితులయ్యారు. ప్రస్తుతం సీతారామిరెడ్డి మండల పార్టీ కన్వీనర్‌గా కొనసాగుతున్నారు. సీతారామిరెడ్డి భార్య ఝాన్సీలక్ష్మి మండల పరిషత్ ఎంపీపీ అభ్యర్థిగా పార్టీ అధిష్టానం ఆదేశాలతో కర్లపాలెం-1 ఎంపీటీసీగా పోటీ చేసి ఎన్నికల ఫలితాలు రాకముందే కరోనా సోకి మృతి చెందారు. అనంతరం జరిగిన బై ఎలక్షన్లలో సీతారామిరెడ్డి కోడలు లక్ష్మీ సామ్రాజ్యం అదే ఎంపీటీసీ స్థానంలో పోటీచేసి భారీ మెజార్టీతో గెలుపొందారు. సీతారామిరెడ్డి వైఎస్సార్ సీపీ బలోపేతానికి చేసిన కృషి ఫలితంగా ఎమ్మెల్యే కోన రఘుపతి, సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆశీస్సులతో మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా ఈ నెలలో ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు సీతారామిరెడ్డి తెలిపారు.

సాగర్‌లో 527 అడుగుల నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 527.10 అడుగుల వద్ద ఉంది. ఇది 162.5409 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి ఎడమ కాలువకు 4,034, ఎస్‌ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 5,384 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 5,384 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 804.80 అడుగుల వద్ద ఉంది. ఇది 31.4403 టీఎంసీలకు సమానం.

• సునీత అనే నేను...



శాసనమండలి సభ్యులుగా ఎన్నికైన పోతుల సునీత బుధవారం సెక్రటేరియేట్‌లో జరిగిన కార్యక్రమంలో బాధ్యతలు స్వీకరించారు. అధికారులు ఆమె చేత ప్రమాణ స్వీకారం చేయించి నిబంధనావళి పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సునీతను పలువురు పార్టీ నేతలు అభినందించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్

డ్వాక్రా రుణాల గోల్‌మాల్‌పై అధికారుల ఉలికిపాటు

- బ్యాంక్ అధికారులతో మున్సిపల్ కమిషనర్ సమావేశం
- రుణాల సమాచారం సేకరణ

సాక్షి స్పందన

రేపల్లె: మహిళలకు ఆర్థిక, సామాజిక భద్రత కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా అక్రమాలకు అడ్డాగా మారిందని 'సాక్షి'లో బుధవారం ప్రచురితమైన కథనానికి అధికారులు ఉలిక్కిపడ్డారు. మెప్మాలో పలువురు రిసోర్స్‌పర్సన్లు నిరక్షరాస్యులైన డ్వాక్రా గ్రూపు మహిళలను మోసం చేసి బ్యాంకులను ఏమార్చి పొందిన రుణాలపై ఆరా తీస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం మున్సిపల్ కమిషనర్ విజయసారథి పట్టణంలోని వివిధ బ్యాంకుల మేనేజర్లతో తన చాంబర్‌లో రహస్య సమావేశం నిర్వహించి రుణాల వివరాలను అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. ఆయా బ్యాంకుల పరిధిలో ఎన్ని గ్రూపులకు ఎన్ని లక్షల రూపాయల మేర రుణాలు మంజూరు చేశారన్న వివరాలను సేకరిస్తున్నారు. మెప్మా విభాగంలో ఆన్‌లైన్ అయిన గ్రూపుల వివరాలు, బ్యాంక్‌ల నుంచి మంజూరైన రుణాల వివరాలను సేకరిస్తున్నారు. దీంతో పట్టణంలోని పలు బ్యాంకులలో అధిక మొత్తంలో 2019కి ముందు ఉన్న గ్రూపులకు రుణాలు మంజూరు చేసి పలువురు ఆర్పీలు చేతివాటం చూపినట్లు తెలుస్తోంది. గతంలో పలుమార్లు మెప్మాలో అవకతవకలు జరిగిన ఘటనలు లేకపోలేదు. ఆయా సమయాల్లో జిల్లా ఉన్నతాధికారులు బాధ్యులపై చర్యలు తీసుకోవటంలో నిర్లక్ష్యం వహించటంతో ఆర్పీలు మరింత రెచ్చిపోయి చేతివాటం ప్రదర్శిస్తున్నారని పట్టణంలోని ప్రజాసంఘాలు విమర్శిస్తున్నాయి.

బైపాస్ పూర్తి చేయకుంటే ఆమరణ దీక్ష

- రిలే దీక్షలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ప్రకటన
- దిగొచ్చిన క్యూబిక్ హైవే లిమిటెడ్
- జూన్ 30 కల్లా పూర్తి చేస్తామని హామీ
- విరమించిన నిరవధిక రిలే దీక్ష



దీక్ష శిబిరంలో క్యూబ్‌లిమిటెడ్ సంస్థ ప్రతినిధులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల రూరల్: పిడుగురాళ్ల పట్టణ ప్రజలు ఎంతకాలంగా ఎదురుచూస్తున్న బైపాస్ నిర్మాణం గడువులోగా పూర్తి చేయకపోతే ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధమని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ప్రకటించారు. మండలంలోని తుమ్మలచెరువు టోల్‌ప్లాజా వద్ద క్యూబిక్ హైవే ప్రైవేట్ లిమిటెడ్ బైపాస్ రోడ్డు నిర్మాణంపై నిర్లక్ష్యానికి నిరసనగా నిరవధిక రిలే నిరాహార దీక్ష బుధవారం చేపట్టారు. తొలుత పిడుగురాళ్ల పట్టణ నుంచి భారీగా వైఎస్సార్ సీపీ శ్రేణులతో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి దీక్ష శిబిరం వద్దకు చేరుకున్నారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ అద్దంకి నార్కెట్‌పల్లి హైవే 212 కిలో మీటర్లకాగా 206 కిలో మీటర్లు 2013లో పూర్తి చేసినట్లు వివరించారు. మిగిలిన భాగం పూర్తి చేయకపోవడంతో ఇప్పుడు పిడుగురాళ్ల పట్టణానికి శాపంగా మారిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడటంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో తాను స్వయంగా మాట్లాడటం, అసెంబ్లీల్లో మలుమార్లు బైపాస్ రోడ్డు గురించి వివరించినట్లు పేర్కొన్నారు. 2023 జనవరిలో క్యూబిక్ లిమిటెడ్ వారు అందుబాటులోకి తీసుకొని వస్తామన్నారు. కానీ సాధ్యం కాలేదన్నారు. ప్రతి రోజు బైపాస్ గురించి కంపెనీ ప్రతినిధులతో చర్చిస్తున్న ఫలితం లేకపోవడంతో దీక్షకు దిగినట్లు చెప్పారు.

దిగివచ్చిన క్యూబిక్ హైవే సంస్థ ప్రతినిధులు...

వెంటనే స్పందించిన క్యూబిక్ హైవే సంస్థ ప్రతినిధులు క్యూబ్ హైవేస్ చైర్మన్ హరికృష్ణరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ భగవన్‌రాజు, రాంకీ ఇన్‌ఫ్రాస్ట్రెక్చర్ వైస్ ప్రెసిడెంట్ దివాకర్ రిలే నిరాహార దీక్షల వద్దకు వచ్చి ఎమ్మెల్యేతో చర్చించారు. బైపాస్ రోడ్డు పూర్తి చేయటానికి జూన్ 30వ తేదీ వరకు గడువు కావాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ అప్పటికి పూర్తి చేయకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు.

అదనపు ఎస్పీ బిందుమాధవ్‌కు వీడ్కోలు



కలెక్టరేట్‌లో బిందుమాధవ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న కలెక్టర్ శివశంకర్, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట: పల్నాడు జిల్లా అదనపు ఎస్పీగా విధులు నిర్వహించి పదోన్నతిపై ఎస్పీగా గ్రేహౌండ్స్‌కి వెళుతున్న గరికపాటి బిందుమాధవ్‌ను బుధవారం కలెక్టర్ కార్యాలయం, జిల్లా పోలీసు కార్యాలయాల్లో ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి, డీఆర్వో కె.వినాయకం, ఏఆర్ అదనపు ఎస్పీ రామచంద్రరాజు, డీఎస్పీలు సి.విజయభాస్కర రావు, యు.రవిచంద్ర, బి.ఆదినారాయణరావు, సి.జయరామప్రసాద్ పాల్గొన్నారు. వినుకొండ రూరల్ సీఐగా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో బదిలీ అయిన రమేష్ బాబును కూడా ఎస్పీ, ఇతర పోలీస్ అధికారులు ఘనంగా సత్కరించారు.



ప్రకృతి ఝరి పా'వనమయ్యే': అభివృద్ధి కానున్న ఉప్పుటేరు ప్రాంతం

సుమనోహర తీరప్రాంతం బాపట్ల జిల్లా సొంతం. అటవీ లావణ్యానికీ ఇక్కడ కొదవేమీ లేదు. తీరం వెంబడి ఇసుక నేలల్లో విస్తరించిన మడ, జామాయిల్, జీడిమామిడి వనాలు సందర్శకులను కట్టిపడేస్తాయి. అరుదైన పక్షుల కిలకిలా రావాలు పర్యాటకులను మైమరిపిస్తాయి. పచ్చని వనాల మధ్యలో నుంచి హొయలొలుకుతూ ప్రవహించే వంపుసొంపుల ఉప్పుటేరు భూతల స్వర్గాన్ని తలపిస్తుంది. అందులో బోటు షికారు మరుపురాని మధురానుభూతిని మిగులుస్తుంది. అందుకే ఈ ప్రాంతానికి పర్యాటక సొబగులు అద్దేందుకు అటవీశాఖ సమగ్ర ప్రణాళిక రూపొందించింది. మడ అడవుల విస్తరణకు చర్యలు చేపడుతోంది.

తనివితీరని రూప లావణ్యం

- ఆకట్టుకునే తీరప్రాంత అటవీ అందాలు
- పర్యాటక అభివృద్ధికి అడుగులు
- ఉప్పుటేరు వాగు పొడవునా సుందరీకరణకు చర్యలు
- అటవీశాఖ సమగ్ర ప్రణాళిక

బాపట్ల జిల్లా తీర అటవీప్రాంతం ఇలా..	మడ అడవులు	జామాయిల్ తోటలు	జీడిమామిడి తోటలు
	1,500 హెక్టార్లు	1,297 హెక్టార్లు	225 హెక్టార్లు

బాపట్లటౌన్: జిల్లాలోని తీరప్రాంతం వెంబడి 9,198.24 హెక్టార్లలో అటవీప్రాంతం ఉంది. ఇక్కడ మడ, జామాయిల్, సరుగుడు, జీడిమామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. అరుదైన వృక్షజాతులకు మడ అడవులు ఆలవాలంగా ఉన్నాయి. వనమూలికలూ లభ్యమవుతాయి. సుమారు 1,500 హెక్టార్లలో మడ అడవులు విస్తరించి ఉన్నాయి. ఈ అడవుల అభివృద్ధికి ఇప్పటికే అటవీశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. రూ.30 లక్షలతో మరో 100 హెక్టార్లలో మడ చెట్లు పెంచుతున్నారు. ఈ అడవుల మధ్యలో సూర్యలంక సముద్ర తీరంలోని పొగురు నుంచి నిజాంపట్నం వరకు ఉప్పుటేరు వాగు ప్రవహిస్తోంది. ఈ ప్రాంతం చూడముచ్చటగా ఉంటుంది. ఈ వాగులో బోటు షికారుకు పర్యాటకులు ఆసక్తి కనబరుస్తారు. అందుకే ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ఆ శాఖ ఉన్నతాధికారులు ప్రతిపాదనలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపారు.

అరుదైన జంతుజాలం

ఇక్కడి మడ అడవుల్లో అరుదైన జంతుజాలం ఉంది. ఫిషింగ్ క్యాట్స్, బావురుపిల్లి, మరక పిల్లి, నీటి పిల్లి, నీటి కుక్కలు, డాల్ఫిన్స్ వంటివి ఇక్కడ జీవిస్తాయని అటవీ అధికారులు చెబుతున్నారు. వీటితోపాటు దేశ, విదేశాల నుంచి సీజనల్‌గా వచ్చే 120 రకాల పక్షులు పర్యాటకులకు కనువిందు చేస్తాయి.

జీడిమామిడి, జామాయిల్‌తో ఆదాయం

ఈ ప్రాంతంలో 1,297 హెక్టార్లలో జామాయిల్ తోటలు విస్తరించి ఉన్నాయి. వీటిద్వారా ఆదాయం వస్తుంది. ఈ తోటలు ప్రస్తుతం కోతకు సిద్ధంగా ఉన్నాయి. త్వరలో అటవీశాఖాధికారులు తోటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నారు. సుమారుగా రూ.80 లక్షల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. అలాగే 225 హెక్టార్లలో ఉన్న జీడిమామిడి తోటల ద్వారా ఏటా రూ.7 లక్షల వరకు ఆదాయం సమకూరుతోంది. అడవుల నరికివేతకు గురైన చోట్ల ప్రత్యేకంగా మొక్కల పెంపకానికీ అటవీ అధికారులు చర్యలు చేపడుతున్నారు. పర్యావరణాన్ని రక్షించే మొక్కలు పెంచాలని ప్రణాళిక సిద్ధం చేశారు.

అడవుల సంరక్షణకు చర్యలు

తీర ప్రాంతానికి అడవులు అందంతోపాటు రక్షణనిస్తాయి. ఇక్కడ జామాయిల్, మడ, సరుగుడు, జీడిమామిడి తోటలు సుమనోహరంగా ఉంటాయి. వీటిని మరింత పెంచేందుకు చర్యలు చేపట్టాం. సంరక్షణకు నిరంతర నిఘా ఏర్పాటు చేశాం. అడవుల్లో వృక్షాలను నరకడం నేరం. అందరూ అటవీ పరిరక్షణకు చర్యలు చేపట్టాలి. లేకుంటే మానవ మనుగడకే ముప్పు వాటిల్లుతుంది.

– ఎల్.భీమయ్య, జిల్లా అటవీశాఖాధికారి



జనజీవనానికి' రక్ష : ఉప్పుటేరు ఇరువైపులా విస్తరించిన అడవులు



కనులు సంబర 'పడవ' : ఉప్పుటేరు వాగులో బోటు షికారు చేస్తున్న పర్యాటకులు, అటవీశాఖ అధికారులు (ఫైల్)



లక్ష్య'మొక్క'టే: అడవులదీవిలో మడ మొక్కలకు నీరు పెట్టేందుకు కాలువలు తవ్వుతున్న దృశ్యం

జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌కు విద్యార్థిని ఎంపిక



బాపట్ల: బాపట్ల ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాల విద్యార్థిని పి.హర్షిత వెంకట సాయి లక్ష్మి జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌కు ఎంపికైనట్టు కళాశాల డీన్ డాక్టర్ వై.రాధా తెలిపారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ (ఢిల్లీ) నిర్వహించిన పీజీ ప్రవేశ పరీక్షలో హర్షిత వెంకట సాయి లక్ష్మి జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు సాధించినట్టు వివరించారు. తమ కళాశాలకే చెందిన జయశ్రీ 12వ ర్యాంకు, వెంకట రుక్మిణి 13వ ర్యాంకు, సుగుణ్యారావు ఈడబ్ల్యూఎస్‌లో 5వ ర్యాంకు సాధించారని వివరించారు. జూనియర్ ఫెలోషిప్‌కు ఎంపికైన హర్షితను కళాశాల అధ్యాపకులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ మృతి

ఫిరంగిపురం: రోడ్డు ప్రమాదంలో హెడ్‌కానిస్టేబుల్ మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మేరికపూడి గ్రామానికి చెందిన తాళ్లూరి సూర్యనారాయణ(51) నరసరావుపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. విధుల్లో భాగంగా గుంటూరు నుంచి నరసరావుపేట వేరొకరి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. నుదురుపాడు సమీపంలోని కల్వర్టు వద్ద అతివేగంగా వచ్చిన టాటా ఏసీ వాహనం ఢీకొంది. ఈ ఘటనలో సూర్యనారాయణ ద్విచక్ర వాహనంపై నుంచి ఎగిరి పక్కనున్న ముళ్లపొదల్లోకి పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. మరోవ్యక్తి ఈపూరు మండలం గుండేపల్లికి చెందిన నాగరాజుకు తీవ్రగాయాలు కావడంతో ఇద్దరిని 108లో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స కోసం తరలించారు. వైద్యశాలలో సూర్యనారాయణ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. దీంతో అతడి మృతదేహానికి పంచనామ అనంతరం స్వగ్రామం మేరికపూడికి తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న పల్నాడు ఎస్పీ రవిశంకర్ రెడ్డి ఆదేశాల మేరకు రూరల్ సీఐ భక్తవత్సలరెడ్డి, ఎస్‌ఐ బాలనాగిరెడ్డి, పల్నాడు జిల్లా పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు టి.మాణిక్యాలరావు వచ్చి సూర్యనారాయణ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తక్షణ సాయంగా మృతుడి భార్యకు రూ.25 వేలు అందజేసినట్లు ఎస్‌ఐ లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు.

బావిలో ఈతకు దిగి పాలిటెక్నిక్ విద్యార్థి గల్లంతు

గుంటూరు రూరల్: సరదాగా బావిలో ఈతకు దిగి పాలిటెక్నిక్ విద్యార్థి గల్లంతయిన ఘటన నల్లపాడులో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. నెల్లూరు నగరంలోని నాగేంద్రనగర్‌కు చెందిన మాదాల భరత్‌చంద్ర(18) నల్లపాడు గ్రామంలోని ఎంబీటీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్నాడు. స్థానికంగా కాలేజ్ సెంటర్‌లోని ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటున్నాడు. పరీక్షలు ఉన్నా మరో 9 మంది స్నేహితులతో కలసి కళాశాల సమీపంలోని తురకపాలెం రోడ్డు రైల్వే క్వార్టర్స్ పరిధిలోని నీటి చెరువు వద్దకు వెళ్లారు. అక్కడే ఉన్న బావిలో తనకు ఈత వచ్చని ఈత వేస్తానని భరత్‌చంద్ర ఒక్కడే బావిలోకి దిగాడు. దిగిన అనంతరం మునిగి పోవటంతో పక్కనే ఉన్న స్నేహితులు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని ఎస్‌ఐ నరహరి పరిశీలించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. విద్యార్థిని వెలికి తీసే ప్రయత్నం రాత్రి వరకూ చేశారు. బావిలోతు ఎక్కువగా ఉండటంతో ఫలితం లేకుండా పోయింది. ఘటనపై రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఎరుకుల సమాజాభివృద్ధికి కృషి

నెహ్రూ నగర్(గుంటూరు): ఎరుకుల సమాజాభివృద్ధికి విద్యావంతులు కృషి చేయాలని ఏపీ ఎరుకల సంక్షేమ సంఘం చైర్మన్ పాలపర్తి శ్రీనివాసరావు పేర్కొన్నారు. జిల్లా ఎరుకుల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన మేడా గోపితో పాటు 40 మంది ఇతర కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార సభ నగరంలోని ఓ హోటల్‌లో బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 8 లక్షల మంది పైగా ఉన్న కుల దైవం ఏకలవ్యుని వారసులుగా ఎరుకల సమాజం విద్య ద్వారానే కుటుంబాల ఎదుగుదలతో పాటు సామాజిక రాజకీయ ఎదుగుదల సాధ్యమని గ్రహించాలన్నారు. మూడోసారి ఎంపికైన నూతన అధ్యక్షులు మేడా గోపి మాట్లాడుతూ గతంలోనే ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎరుకల సమాజం ఎదుర్కొంటున్న ఎదుర్కొన్న అనేక సమస్యలపై పోరాడి ప్రభుత్వం, రాజకీయ నాయకుల దృష్టికి తీసుకువచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేశామని అదే స్ఫూర్తితో పనిచేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసులు, రాష్ట్ర మహిళ వర్కింగ్ ప్రెసిడెంట్ జయలక్ష్మి, కోశాధికారి లీలా శంకర్, జిల్లా గౌరవాధ్యక్షులు అమాసు శ్రీరాములు,ప్రధాన కార్యదర్శి, ఎం వెంకటకృష్ణ, ఏడుకొండలు, టైగర్ శ్యాం ప్రసాద్ పాల్గొన్నారు.

పల్నాడులో వందేభారత్ రైలును ఆపండి

నరసరావుపేట: పల్నాడు ప్రాంతంలోని పలు రైల్వే సమస్యల పరిష్కారం కోరుతూ కేంద్ర రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌ను ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు బుధవారం ఢిల్లీలో కలిశారు. సికింద్రాబాద్ నుంచి తిరుపతి వరకు ఈ మధ్య ప్రారంభించిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను పల్నాడు జిల్లాలోని పిడుగురాళ్ల లేదా నడికుడి స్టేషన్లలో ఆపాలని విజ్ఞప్తి చేశారు. ఈ రెండు స్టేషన్ల నుంచి ప్రయాణికులు, వ్యాపారులు అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో ప్రయాణం చేస్తుంటారని తెలిపారు. ఈ రైలు ఈ ప్రాంతంలో నిలపడం వల్ల జిల్లాలో పర్యాటక, వ్యాపార ప్రయాణాలను ఆకర్షించి, ఆర్థికాభివృద్ధిని ప్రోత్సహించవచ్చని మంత్రికి తెలిపారు. సికింద్రాబాద్ నుంచి తిరుపతి వరకు వందేభారత్ రైలును ప్రారంభించాలని చేసిన విన్నపం మేరకు రైలును ప్రారంభించినందుకు మంత్రికి ముందుగా ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు కృతజ్ఞతలు తెలిపారు.

అటవీప్రాంతంలో చెలరేగిన మంటలు



ముత్తాయపాలెం అడవిలోని జామాయిల్ తోటలో చెలరేగిన మంటలు

బాపట్లటౌన్: సూర్యలంక సమీపంలోని ముత్తాయపాలెం అడవిలో ఉన్న జామాయిల్ తోటకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో మంటలు చెలరేగాయి. దీంతో సూర్యలంక వైపు వెళ్ళే పర్యాటకులు, గ్రామస్తులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు. ఈ విషయంపై అటవీశాఖ అధికారులను వివరణ కోరగా గుర్తుతెలియని వ్యక్తులు విసిరిన అగ్గిపుల్ల కారణంగా మంటలు చెలరేగినట్టు వివరించారు. జామాయిల్ తోటలో కింద రాలిన ఆకులు మాత్రమే ఆహుతయ్యాయని వివరించారు. తోటలకు ఎలాంటి నష్టం వాటిల్ల లేదని పేర్కొన్నారు.

మే 15 నాటికి టిడ్కో ఇళ్లు అందజేయాలి

ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)



నిడమర్రు టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ హనుమంతరావు

మంగళగిరి: నగరంలో మిగిలిఉన్న వైఎస్సార్ జగనన్న కాలనీ టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు మే 15వ తేదీ నాటికి అందజేసేలా పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) అన్నారు. నగర పరిధిలోని నిడమర్రు టిడ్కో గృహాల వద్ద బుధవారం టిడ్కో, విద్యుత్‌శాఖ, నగరపాలక సంస్థ అధికారుల సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోనే తొలిసారిగా మంగళగిరిలోని 1,728 ఇళ్లకు అన్ని మౌలిక వసతులు కల్పించి గృహ ప్రవేశాలు చేయించినట్లు చెప్పారు. టిడ్కో ఎండీ శ్రీధర్ మాట్లాడుతూ సీఆర్‌డీఏ పరిధిలో మొత్తం 5,260 టిడ్కో గృహాలను నిర్మిస్తుండగా మంగళగిరి నియోజవర్గంలోని పెనుమాక, నవులూరు, నిడమర్రులో 1850 గృహాలను నిర్మిస్తున్నట్లు చెప్పారు. వీటిలో నిడమర్రులోని 550 ఇళ్లను అన్ని వసతులు పూర్తయిన నేపథ్యంలో మే ఒకటో తేదీన లబ్ధిదారులకు అందజేయడం జరుగుతుందని వివరించారు. పెనుమాక, నవులూరు ఇళ్లకు రోడ్లు, విద్యుత్‌తో పాటు తాగునీరు వసతులను కల్పించి మే 15వ తేదీ నాటికి లబ్ధిదారులకు అందజేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, నగరపాలక సంస్థ కమిషనర్ యు.శారదాదేవి, డీసీపీ మహాలక్ష్మి దొర, డీఈ కృష్ణారెడ్డి, టిడ్కో సీఈ గోపాల కృష్ణారెడ్డి, ఎస్‌ఈ చిన్ని కోటేశ్వరరావు, ఈఈ ప్రసాద్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, విద్యుత్‌శాఖ ఈఈ విజయ్‌కుమార్, డీఈఈ అక్కల సత్యనారాయణ ఏఈ చిరంజీవి, పంచాయితీ కార్యదర్శి ధనలక్ష్మి పాల్గొన్నారు.

కేఎల్‌యూలో ఆటిజమ్‌పై అంతర్జాతీయ సదస్సు



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న డాక్టర్ ప్రతిమా మూర్తి

మంగళగిరి: మానసిక దివ్యాంగులను ఆదరించాలని బెంగళూరు నిమ్ హాన్స్ వైద్యాధికారి, ప్రముఖ మానసిక శాస్త్రవేత్త డాక్టర్ ప్రతిమా మూర్తి పేర్కొన్నారు. నగర పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో బుధవారం జరిగిన ఆటిజమ్ అంతర్జాతీయ సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సదస్సు కన్వీనర్ డాక్టర్ వసుధాదేవి అధ్యక్షతన జరిగిన సదస్సును డాక్టర్ ప్రతిమా మూర్తి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల మేరకే పలు దేశాల్లో మానసిక రోగులకు వైద్య సేవలను అందించడమే కాకుండా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రముఖ శాస్త్రవేత్త ఆల్‌బర్ట్ ఐన్‌స్టీన్ ఆటిజమ్ బాధితుడేనన్నారు. ఐన్‌స్టీన్‌కు బోధన చేయలేమని ఉపాధ్యాయులు చేతులెత్తేసినా గొప్ప శాస్త్రవేత్తగా గొప్ప విజయాలు సాధించి అందరినీ అబ్బురపరిచారని గుర్తు చేశారు. కేఎల్‌యూ వైస్ చైర్మన్ కోనేరు రాజా హరీన్ మాట్లాడుతూ ఆటిజమ్ ఉన్న వారిలో కూడా సాధారణ వ్యక్తుల్లో లేని నైపుణ్యాలు ఉంటాయన్నారు. ఏడాది వయస్సు నుంచే పిల్లలు మాటలు, చేతలు చురుగ్గా లేనట్లయితే వారిలోని లోపాన్ని మూడేళ్ల వయస్సు లోపు తల్లిదండ్రులు గుర్తిస్తే అటువంటి పిల్లలకు నూతన జీవితాన్ని ప్రసాదించవచ్చునన్నారు. ఏప్రిల్ నెలను ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆటిజమ్ మాసోత్సవంగా ప్రకటించిన కారణంతో తాము ఆటిజమ్‌పై అంతర్జాతీయ సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. ఆటిజమ్ కలిగిన బాల బాలికల కోసం వర్సిటీలో ప్రత్యేక థెరపీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి సేవలు అందించనున్నామని తెలిపారు. ప్రో.వీసీ డాక్టర్ కేఎస్ జగన్నాథరావు మాట్లాడుతూ ఆటిజమ్ చికిత్స, పిల్లల్లో అత్యుత్తమ ప్రతిభను వెలికి తీయడం గురించి వివరించారు. జపాన్‌కు చెందిన ప్రొఫెసర్ శ్యామ్యూల్ అబ్రహం, డాక్టర్లు కె.నాగార్జున, వి.శ్రీదేవి, ఆటిజమ్ పిల్లలకు అమూల్యమైన సేవ చేస్తున్న ప్రముఖ సామాజిక కార్యకర్తలతో పాటు డాక్టర్ ప్రతిమా మూర్తి, డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ వై.అపర్ణలను ఘనంగా సత్కరించారు. వివిధ పాఠశాలలకు చెందిన ఆటిజమ్ పిల్లలు డ్యాన్స్, ఆటలు, క్విజ్ పోటీల్లో చురుగ్గా పాల్గొన్నారు. పిల్లలకు బహుమతులను అందజేశారు. రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎంహెచ్‌ఎస్ డీన్ డాక్టర్ కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.